

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని పంచారామ క్షేత్రాలకు టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో క్షేత్రాల సందర్శనకు ఈనెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో ఈ బస్సులు బయలుదేరుతాయి. ఒకరికి టికెట్ ధర సూపర్‌లగ్జరీలో రూ.2,600, అల్ట్రా డీలక్స్‌కు రూ.2,500. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసుకునే అవకాశం ఉంద'ని శ్రీనివాసరావు తెలిపారు.



నరసన్నపేట : బీసీ బాలికల వసతిగృహంలో దీపాలు వెలిగిస్తున్న విద్యార్థినులు

దీపావళి వెలుగులు

నరసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాఅంతటా చిన్నారుల నుంచి పెద్దల వరకూ దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎక్కడ చూసినా దీపాల కాంతులు, మతాబుల వెలుగులు విరజిల్లాయి. నరసన్నపేటలోని బీసీ, ఎస్సీ బాలికల వసతిగృహాల్లో సంస్కృతి ఉట్టిపడేలా సంబరాలు చేసుకున్నారు. వివిధ రకాల పిండి వంటలు తయారుచేశారు. ముగ్గుల మధ్య దీపాలను అలంకరించారు. వేడుకల్లో వసతిగృహ అధికారులు టెంక సూర్యప్రభ, పి.పద్మావతి పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయే!

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- శ్రీముఖలింగంలో ఏర్పాట్లు పూర్తి



జలుమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. జిల్లాలో శ్రీముఖలింగం, రావివలసలోని ఎండలమల్లికార్జునస్వామి, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం తదితర ఆలయాల్లో శివనామ స్మరణ మార్మోగనుంది. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 21 వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయాల నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. శ్రీముఖలింగంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో ఏడుకొండలు తెలిపారు. 'వీఐపీలకు ప్రత్యేక మార్గంతోపాటు ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశాం. ఆలయ ప్రాంగణంలో టెంట్లు వేశాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తామ'ని ఈవో తెలిపారు. వీధుల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టామని సర్పంచ్ సతీష్ వివరించారు. భక్తుల కోసం కార్తీక సోమవారాల్లో ఆలయానికి ఎదురుగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తామని అచ్యుతాపురం వైద్యాధికారి పూజారి సుజాత తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.



శ్రీముఖలింగంలోని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

- అన్ని విభాగాల్లో సీనియర్ వైద్యులు సేవలందించాల్సిందే..
- నిర్లక్ష్యం కనిపిస్తే ఉపేక్షించేది లేదు
- ఖాళీల భర్తీకి తక్షణ చర్యలు
- 24 గంటల్లో లిఫ్టులు పనిచేయాలి
- జీజీహెచ్ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం
- రూ.40 లక్షల వైద్య పరికరాలు ప్రారంభం

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'ఆసుపత్రికి వచ్చే రోగులు ఆనందంగా బయటకు వెళ్లాలి. ఇదే ప్రభుత్వ లక్ష్యం. అన్ని విభాగాల్లో సీనియర్ వైద్యులు సేవలందించాల్సిందే. పని చేయడం ఇష్టంలేకపోతే బయటకు వెళ్లిపోండి' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్- రిమ్స్) అధికారులు, వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్, ప్రసూతి విభాగాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన పరిశీలించారు. రూ.40 లక్షల విలువైన లాప్రోస్కోపిక్, హిస్టెరోస్కోపిక్ పరికరాలను ప్రారంభించారు. ఈ పరికరాలతో గర్భసంచి లోపల సమస్యలను గుర్తించడం, చికిత్సలు అందించడం సాధ్యపడుతుందని వైద్యులు వివరించారు. తొలుత ఓపీ విభాగానికి చేరుకుని అక్కడ రోగులతో మాట్లాడారు. ఓపీలో రోగులు వేచిఉండే సమయాన్ని తగ్గించేందుకు సిబ్బందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం వైద్య కళాశాల ఆడిటోరియంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది సేవలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నేను ఆసుపత్రిలో పర్యటించాను. పారిశుధ్య నిర్వహణ పరిస్థితి బాగాలేదు. నేను వచ్చానని పరిశుభ్రంగా ఉంచారు. సిబ్బంది కొరత లేదు. మరి ప్రతిరోజూ ఎందుకు ఇలా పరిశుభ్రంగా ఉంచడం లేదు. ఆసుపత్రి అధికారిగా చేరి ఆరు నెలలు కావస్తున్నా సరే జాయింట్ డైరెక్టర్ ఇంతవరకు ఏం చేశారో తెలియడం లేదు. ఇలాగేనా పనిచేసేది. ఆసుపత్రి అవసరాలకు సంబంధించి ఇంతవరకూ ఏమీ అడగలేదు. ఇక్కడ సమస్యలే మీ లేవా?. ఇలా పనిచేస్తే ఆసుపత్రి ఎలా అభివృద్ధి చెందుతుంది.? ఏం చేస్తున్నారు మీరంతా. ఆరు నెలలుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సరిగా విధులకు హాజరు కావడం లేదు. ఎవరైనా సరే సేవలందించాలనుకుంటేనే ఇక్కడ పనిచేయండి. లేదంటే వెళ్లిపోండి. వైద్యులు, సిబ్బంది ఎందుకు రోస్టర్ పాటించడం లేదు. క్యాజువాలిటీ, అత్యవసర విభాగాల్లో జూనియర్ వైద్యులే సేవలందిస్తున్నారు. సీనియర్ వైద్యులు సేవలందించరా?. ఇకనుంచి ఇలా జరగడానికి వీల్లేదు. సీనియర్ వైద్యులు పని చేయాల్సిందే. రిఫరల్ కేసుల సంఖ్య పెరగకుండా తక్షణ చర్యలు తీసుకోండి. ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య పెరగాలి. ఎప్పుడు చూసినా ఆసుపత్రి లిఫ్టులు పనిచేయవు. ఏం చేస్తున్నారు. 24 గంటల్లో లిఫ్టులు పనిచేసేలా చర్యలు తీ సుకోండి. మినిట్స్ బుక్ లేకుంటే అభివృద్ధి వివరాలు, గత ఏడాదిగా ఏం చేస్తున్నారో ఎలా తెలుస్తుంది. రోగులకు అందించే ఆహారం మెనూ వివరాలను ప్రతి వార్డులో ప్రదర్శించాలి. గత 18 నెలల్లో రూ.80 లక్షల విలువైన పరికరా లు ఆసుపత్రికి అందజేశాం. మరిన్ని అందజేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రణాళికలు తయారుచేసి, వివరాలు అందజేయండి' అని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

- రూ.60కోట్లతో హాస్టల్, లైబ్రరీ భవనాలు పూర్తయ్యాయని, రూ.2కోట్లు విలువైన ఫర్నీచర్ లేక 2023 నుంచి ఈ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదని ఆసుపత్రి జేడీ తెలుపగా.. రూ.2కోట్ల నిధుల మంజూరుకు తక్షణ చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. ఆసుపత్రిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐడీసీ డీఈని ఆదేశించారు. నిధులను అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎమర్జెన్సీ విభాగంలో బెడ్లు సరిపోవడం లేదని, సంఖ్యను పెంచాలని విభాగాధిపతి కోరగా.. వెంటనే అందుకు సంబంధించిన వివరాలను (మిగతా 7వ పేజీలో..)

రిజిస్ట్రేషన్ల జోరు



శ్రీకాకుళంలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం



- తొలి ఆరునెలల్లో పెరిగిన క్రయవిక్రయాలు
- లక్ష్యం రూ.121.47 కోట్లు
- ఆదాయం రూ.107.75 కోట్లు
- 88.70 శాతం రాబడితో ఫర్వాలేదనిపించిన జిల్లా

శ్రీకాకుళం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం అందించే వాటిలో కీలకమైనది స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ. గతంతో పోల్చితే క్రయవిక్రయాలకు వాతావరణం అనుకూలంగా ఉండటం.. నిబంధనలు సడలింపు... రిజిస్ట్రేషన్ల సులభతరం ఇటువంటివన్నీ రిజిస్ట్రేషన్ శాఖకు కలిసివచ్చాయి. జిల్లాలో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి ఆరు నెలల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు దాదాపు ప్రభుత్వ లక్ష్యానికి చేరుకున్నాయి. జిల్లాలో మొత్తం 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు ఆదాయం రూ.121.47 కోట్లు సమకూర్చాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. కాగా.. ఈ ఆరు నెలల్లో జిల్లావ్యాప్తంగా 35,202 డాక్యుమెంట్స్ రిజిస్టర్ అయ్యాయి. రూ.107.75 కోట్లు ఆదాయం సమకూరింది. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు లక్ష్యాన్ని అధిగమించాయి. మరికొన్ని 70 శాతానికిపైగా, ఇంకొన్ని కార్యాలయాలు వంద శాతానికి సమీపంలో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 88.70శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. శ్రీకాకుళం నగరంలో అత్యధిక డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగినా.. ఆ స్థాయిలో ఆదాయం లభించలేదు.

లక్ష్యానికి మించి..

ప్రభుత్వం మారడంతో గతేడాది అంతంతమాత్రంగానే రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకోవడంతో జిల్లాలో భూ లావాదేవీలు.. ఆస్తి విక్రయాలు భారీసంఖ్యలో పెరిగాయి. ఖాళీస్థలాలు, అపార్ట్‌మెంట్‌లు, నివాస స్థలాల విక్రయాలు ఊపందుకున్నాయి. పాతపట్నం, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, నరసన్నపేట సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నూరు శాతం రిజిస్ట్రేషన్ల లక్ష్యాలను దాటేశాయి. ఆయా ప్రాంతాల్లో ఒక్కసారిగా 'బూమ్' పెరిగింది. ఈ ప్రాంతాల్లో నిర్మాణరంగం జోరందుకుంది. వీటితో పోల్చితే... హిరమండలం, రణస్థలం, సోంపేట, టెక్కలి, శ్రీకాకుళం లక్ష్యాలను 90శాతం చేరుకున్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ విధానం కలిసి వచ్చింది. ఒకప్పటితో పోల్చితే డాక్యుమెంట్ విధానం సరళీకరణ.. మరింత సులభతరమైంది. వ్యాపారులు.. సామాన్యులు ఈ దఫా భూ కొనుగోలుపైనే (మిగతా 7వ పేజీలో..)

ఇదీ ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	ఏప్రిల్-సెప్టెంబరు టార్గెట్(రూ.కోట్లలో)	చేరుకున్న లక్ష్యం(రూ.కోట్లలో)	శాతం	డాక్యుమెంట్లు
ఆమదాలవలస	6.28	7.03	111.95	2,753
హిరమండలం	3.09	2.90	93.64	1,799
ఇచ్ఛాపురం	5.27	5.36	101.65	2,648
కాశీబుగ్గ	13.49	9.86	73.15	3,719
కోటబొమ్మాళి	6.58	4.62	70.13	1,871
మందస	2.82	1.98	70.25	1,123
నరసన్నపేట	6.56	7.82	119.18	2,001
పాతపట్నం	3.99	4.16	104.31	2,103
పొందూరు	10.96	8.51	77.63	3,052
రణస్థలం	9.42	9.04	96.04	3,183
సోంపేట	4.80	4.62	96.23	2,121
శ్రీకాకుళం (ఓ.బీ)	41.12	34.79	84.61	5,913
టెక్కలి	7.04	7.00	99.54	2,916
మొత్తం	రూ. 121.47 కోట్లు	రూ. 107.75 కోట్లు	88.70	35,202

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఐబీఎం క్వాంటమ్ ఆఫ్ ఇండియా లీడ్ వెంకట సుబ్రహ్మణ్యం
- అట్టహాసంగా ప్రారంభమైన క్విస్కిట్ పాల్ ఫెస్ట్



ఐబీఎం క్వాంటమ్ ఆఫ్ ఇండియా లీడ్ వెంకట సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే ఈశ్వరరావు, ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచీకరణ నేపథ్యంలో భవిష్యత్ అంతా క్వాంటమ్ కంప్యూటింగ్‌తోనే. సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల'ని అమరావతి క్వాంటమ్ వ్యాలీ ముఖ్య సలహాదారు, ఐబీఎం క్వాంటమ్ ఆఫ్ ఇండియా లీడ్ ఎల్.వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలోని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో మంగళవారం ఐబీఎం క్వాంటమ్ సహకారంతో క్విస్కిట్ పాల్ ఫెస్ట్ -2025 అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా 55 విద్యా సంస్థల్లో ఈ ఫెస్ట్ నిర్వహిస్తుండగా, రాష్ట్రంలో ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఈ ఫెస్ట్ నిర్వహణకు వేదిక కావడం విశేషం. ఈ నెల 27 వరకు నిర్వహించనున్న ఈ ఫెస్ట్ కోసం ఆన్‌లైన్‌లో 46 వేల మంది, ఆఫ్‌లైన్‌లో 4 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తొలిరోజు ఫెస్ట్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా ఐబీఎం క్వాంటమ్ ఆఫ్ ఇండియా లీడ్ ఎల్.వెంకట సుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించారు. 'సాంకేతికపరంగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి. బ్యాంకింగ్ రంగంలో క్వాంటమ్ టెక్నాలజీ వినియోగం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. దీనివల్ల బ్యాంకింగ్‌లో 34 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయి. నేషనల్ క్వాంటమ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ టెక్నాలజీ అభివృద్ధికి రూ.6వేల కోట్లను కేటాయించింది. దీని ద్వారా వాతావరణం, వ్యవసాయం, ఆరోగ్యం, ఆర్థిక, ఇంధనం తదితర రంగాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించగలమ'ని ఆయన తెలిపారు.

రోల్‌మోడల్‌గా వ్యవహరించాలి

మరో అతిథి విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్ మాట్లాడుతూ.. 'ఈ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు రోల్ మోడల్‌గా వ్యవహరించాలి. ఇక్కడి క్యాంపస్‌లో ఫెస్ట్ నిర్వహణ రాష్ట్రానికే గర్వకారణం. సాంకేతిక రంగంలో మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. నైపుణ్యం, కష్టపడే తత్వంతోనే మెరుగైన ఫలితాలు సాధించగలరు. క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా. ప్రతిభకు మార్కులు కొలమానం కాదు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత ప్రేరణతోనే సమస్యల పరిష్కారానికి నైపుణ్యం పెంపొందించుకోవాల'ని సూచించారు.

గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. 'ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థులు గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి. ఉద్యోగాలు కల్పించే దిశగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు ముందడుగు వేయాల'ని తెలిపారు. అలాగే ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. 'విద్యార్థులు ఈ ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి. క్వాంటమ్ టెక్నాలజీని (మిగతా 7వ పేజీలో..)

మా డబ్బులు మాకు ఇవ్వండి

- ఇచ్ఛాపురం పోస్టాఫీసు ఎదుట ఖాతాదారుల నిరసన
- సిబ్బందిని లోపలకు వెళ్లనీయకుండా కార్యాలయానికి తాళం
- 15 రోజుల్లో న్యాయం చేస్తామన్న పోస్టల్ ఉన్నతాధికారులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయం ఎదుట ఖాతాదారులు మంగళవారం నిరసనకు దిగారు. 33మంది ఖాతాదారుల నుంచి రూ2.80కోట్లు స్వాహా చేశారంటూ ఆందోళన చేపట్టారు. కార్యాలయం గేటుకు తాళం వేసి సిబ్బందిని లోపలకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. పోస్టల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. బాధితులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బి.హైమ మద్దతు తెలిపారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా తమ పిల్లల పేరున పోస్టాఫీస్‌లో కేవీబీ బాండ్లు రూపంలో డబ్బులు దాచుకున్నట్లు బాధితులు తెలిపారు. కానీ, సైబర్ నేరగాళ్లతో కలిసి పైసా కూడా లేకుండా ఖాతాలు ఖాళీ చేసేశారని రూ.10లక్షలు కోల్పోయిన చాట్ల తులసీదాస్‌రెడ్డి, రూ.12 లక్షలు పోయిన కిరణ్మయి, రూ.20లక్షలు పోగొట్టుకున్న ఇసురు బాలరాజు, రూ.30లక్షలు కోల్పోయిన ఒడిశా నొవగాంకు చెందిన డిల్లమ్మతో పాటు మరికొందరు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు టెంట్లు వేసుకొని కూర్చొన్నారు. పోస్టుమాస్టర్ జి.షణ్ముఖరావు నచ్చజెప్పినా బాధితులు వినకపోవడంతో ఆయన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా బాధితులు వినలేదు. డబ్బులు చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే నిరసన విరమించుకుంటామని బాధితులు అనడంతో 'నేను ఎలా రాసి ఇస్తాన'ని ఇన్‌స్పెక్టర్ అన్నారు. వెంటనే ఆయన పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అధికారి హరిబాబుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అందరికీ న్యాయం చేస్తామని, ఒక్క పైసా కూడా పోదని ఏడీ ఫోన్ ద్వారా వాయిస్ మెసేజ్ పంపించారు. అలాగే, జనసేన ఇన్‌చార్జి రాజుతో కూడా ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 15రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో బాధితులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు. తమకు న్యాయం జరగకపోతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని తెలిపారు.



ఖాతాదారులతో మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్

దీపావళికి దూరంగా పొందూరు పుట్టుగ (7లో)

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

గోదాముపై టపాసులు పడి..

- సోంపేటలో అగ్నిప్రమాదం

రైతుబజారు లేక రోడ్లపైనే వ్యాపారాలు (8లో)



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కలిశెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి స్ఫూర్తిదాయకం

- మంత్రి అచ్చెన్నాయుడు
- అమరవీరులకు ఘన నివాళి

7లో

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి స్ఫూర్తిదాయకం

● అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను పణంగా పెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేసే కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా పోలీసు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది.. పరేడ్ కమాండర్ శంకర్ ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన స్మృతి పరేడ్ ద్వారా అమరవీరులకు నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను మంత్రి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా


తుపాకీని పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడడంలో పోలీసులు చూపుతున్న చొరవ, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడంలో గొప్పగా పని చేస్తున్న పోలీసులను ఆయన అభినందించారు. మహిళలపై అఘాయిత్యాలు, అపహరణలు, రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రం మొత్తం సీసీ కెమెరాలు పెట్టి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని.. పోలీస్ రిక్రూట్‌మెంట్ తరచూ చేపట్టాలని సూచించారు. ఇటీవల పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన ఆరువేల మందికి త్వరలోనే నియామక పత్రాలను అందజేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. పోలీసులు లేకుండా ప్రగతి లేదని, దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్టమైనదన్నారు. త్వర లోనే కారుణ్య నియామకాలపై దృష్టి సారిస్తామన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ప్రాణత్యాగం చేసిన ఎస్.బంగారు నాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్ర దాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి తదితరుల సేవలను గుర్తు చేసుకున్నారు. పోలీసుల కుటుంబాలకు ఈ ఏడాది కారుణ్య నియామకాలు కల్పించామని, ఆరోగ్యభద్రత, కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని చెప్పారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి కుటుంబ సభ్యులకు మంత్రి జ్ఞాపికలను అందించారు. ఓపెన్‌హౌస్‌ను అతిథులు తిలకించారు. పావురాలను, బెలూన్లను గాల్లోకి విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, డీఆర్వో వెంకటేశ్వరరావు, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి, ఆర్డీవో సాయి ప్రత్యూష, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌ను మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)ని మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో సిబ్బంది కొరత ఉందని, అలాగే శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థలో కూడా సమస్యలను గుర్తించామన్నారు. తక్షణం వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికే రూ.80లక్షల పరికరాలను అందజేశామని, గతంలో మేం రూ.60 కోట్లతో చేపట్టిన నూతన హాస్టల్ భవనాలు, వైద్యకళాశాల లైబ్రరీ భవనాలు పూర్తయిపోయినా సరే, కేవలం రూ.2 కోట్ల వెలువైన ఫర్నిచర్ సమకూర్చలేక వైసీపీ ప్రభుత్వం వదిలేసిందన్నారు.

వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నామని 2026 జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, పూర్తవుతాయన్నారు. జిల్లాలో పవర్ ప్రాజెక్టులు, మూలపేట ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలో వలస లు పూర్తిగా నివారణ అవుతాయన్నారు. ప్రజలు సహకారంతోనే పూర్తిస్థాయి అభి వృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధి కారులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని సెక్యూరిటీ సిబ్బంది వినతి

మంగళవారం రిమ్స్ ఆసుపత్రి సమీక్ష సమావేశం సందర్భంగా రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది తమకు అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వడం లేదని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. దీంతో మంత్రి సంబంధిత సెక్యూరిటీ సంస్థ ప్రతినిధిని పిలిచి.. ఎందుకు వారికి వేతనాలు నిబంధనలకు అనుగుణంగా ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అగ్రిమెంట్ ప్రకారం వారికి వేతనాలు ఇవ్వాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నర్సింగ్ సిబ్బంది తమకు సిక్‌రూమ్ లేదని, కేటాయించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

జీడి పంట అభివృద్ధికి చర్యలు తీసుకోండి

కవిటి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో జీడిపంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను మంగళ వారం రామయ్యపుట్టుగలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో జీడిపంట దిగుబడి తక్కువ గా ఉందన్నారు. కొత్తరకం ఎం-23జీడి రకాన్ని రాష్ట్రంలో వచ్చేలా కృషి చేయాలని కోరారు. జీడి తోటల పునరుద్ధరణకు నాణ్యమైన విత్త నాలు వచ్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎ.అనిల్, బి.జయకృష్ణ, బి.వెంకట రావు, బి.విజయకృష్ణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్దానం రైతులు

మండపల్లిలో సమస్యలు పరిష్కరించండి

కంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండపల్లి పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామా రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామస్థులు డి.కేశవరావు, డి.కవిబాబు తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలి

కవిటి/సోంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన అందించాలని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ కోరారు. కవిటి, సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని సూచించారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 36 రోజుల స్టడీప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కవిటి ఇన్‌చార్జిప్రిన్సిపాల్ పి.హరి, సోంపేట ప్రిన్సిపాల్ ఎ.మోహన్‌రావు, ఏజీఎంవో పి.రజనీకుమారి పాల్గొన్నారు.


సోంపేట: మాట్లాడుతున్న డీవీఈవో సురేష్‌కుమార్

ఆదిత్యుని సేవలో హోమ్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ..

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ జాయిం ట్ సెక్రటరీ బాల కిరణ్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. వారికి ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, మాధవశర్మ, రంజిత్‌శర్మ పాల్గొన్నారు.


స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం


పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి

(ఐదో పేజీ తరువాయి)

అందజేయాలని అచ్చెన్న అన్నారు. సెక్యూరిటీ సిబ్బంది యూనిఫామ్స్ ధరించాలని, సమీక్ష సమావేశాల మినిట్స్‌ను తదుపరి సమావేశంలో అందజేయాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీకి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పల నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పుకాపు సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్‌గా వెంకట్

పొందూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా లోలుగు గ్రామానికి చెందిన లోలుగు వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన సంఘం మహాసభలో వెంకట్‌ను ఎన్నుకున్నారు. తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న వెంకట్ తూర్పు కాపు సంక్షేమ సంఘం కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తనను సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై ఆయన ఆనందం వ్యక్తంచేస్తూ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



సహకార శాఖ ఉద్యోగులకు శిక్షణ

గుజరాతీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా సహకార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణ సర్‌చార్జీ, అవార్డు, ఈపీలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ గండేపల్లి శ్రీనివాసరావు, సహకార శాఖ అధికారులు ఎం.చంటిబాబు, జి.శ్రీనివాసు, కె.మురళీకృష్ణ, డి.సత్యనారాయణ, పి.జానకీరామ్, శశిభూషణ్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమైక్యత సంఘ్ లక్ష్యం

రణస్థలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమైక్యతను పెంపొందించడమే సంఘ్ లక్ష్యమని సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఖండ సంఘ చాలక్ మేడూరి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ సమావేశం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవ ప్రణాళికలు, సామాజిక సామరస్యం, పంచ పరివర్తన తదితర అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల జోరు

(ఐదో పేజీ తరువాయి)

ఎక్కువగా దృష్టిసారించడంతో ప్రభుత్వ ఖజానా కాస్త కళకళలాడుతోంది.

● ఆ నాలుగు స్థానాల్లో 70 శాతంపైగా..

కాశీబుగ్గ, మందస, పొందూరు, కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యాల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల్లో లక్ష్యంలో 70 శాతాన్ని దాటాయి. పెద్దగా గతం కంటే మార్పులేదు. ఈ ప్రాంతాల్లో క్రయ విక్రయాలు తక్కువగా ఉన్నాయి. అలాగే ఇక్కడి వాసులు పక్క పట్టణా ల్లోను.. ఇతర ప్రాంతాల్లోను ఆస్తులు కొనుగోలు చేసి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. దీంతో ఈ నాలుగు స్థానాల్లో 70శాతం మాత్రమే ఆదాయం దాటింది. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేనాటికి లక్ష్యాన్ని చేరుకోగలదా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

(ఐదో పేజీ తరువాయి)

ఇంజనీరింగ్‌లో మైనర్ సబ్జెక్ట్‌గా తీసుకువస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ ఎం.శివ రామకృష్ణ, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, కో కన్వీనర్‌లు రవి, రమేష్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి హఠాన్మరణం

● 51 సార్లు రక్తదానం చేసిన కల్యాణ్

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కేకేవీ పురుషోత్తమరావు (కల్యాణ్) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. 51 సార్లు రక్తదానం చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. 18 ఏళ్లుగా రెడ్‌క్రాస్ సొసైటీలో సేవలందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా కీలకపాత్ర వహించారు. తన కళ్లను దానం చేశారు. కార్నియా లను రెడ్‌క్రాస్ సిబ్బంది సేకరించి విశాఖ ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. కల్యాణ్ మృతి పట్ల రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, సిబ్బంది సంతాపం తెలిపారు.


కల్యాణ్ (ఫైల్)

'పీఎంఆర్‌కేవీవై'పై అవగాహన

ఇచ్ఛాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పీఎంఆర్‌కేవీవై) పథకంపై బెల్లుపడ, లొద్దపుట్టి గ్రామంలో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటరావు రైతులకు అవగాహన కలిగించారు. అలాగే పెసర, మినుములు, నువ్వు పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆమదాలవలస వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, ఎంఏవో అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు త్వరితగతిన చేపట్టాలి

ఆమదాలవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ క్రాప్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ పంటల నమోదు పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ-పంట నమోదు ప్రక్రియకు ఈ నెల 25వ తేదీ ఆఖరు అని, రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహా యకులను సంప్రదించాలన్నారు.

వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ చానల్‌లోకి పట్టణంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు రావడం వల్ల దుర్గంధంతో పాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తగు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం మునిసిపల్ ఇన్‌చార్జి కమిష నర్ అప్పలస్వామి, తహసీల్దార్ వెంకటరావు, పట్టణ ఎస్ఐ ముకుందరావులను కలిసి వినతి పత్రాలను అందించారు. నీటి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయరెడ్డి, రామారావు, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాక్సింగ్‌లో వివిధ కేటగిరిల్లో ఎ.రామ్ చరణ్, జి.సత్య భార్గవ్, ఎస్.దేవీవర ప్రసాద్ విజేతలుగా నిలిచారు. వీరంతా ఈ నెల 28వ తేదీ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కీడాకారులను డీఈవో ఎ.రవిబాబు, జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.తవిటయ్య, కార్యదర్శి బీవీరమణ అభినందించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గార, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. వమరవల్లి డైట్‌లో మంగళవారం విద్యార్థినులకు వివిధ చట్టాలను వివరించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దీపావళికి దూరంగా 'పొందూరుపుట్టుగ'

కవిటి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామానికి చెందిన వ్యక్తులకు ప్రమాదం జరిగిందని తెలిసి గ్రామస్థులంతా దీపావళి పండుగను చేపట్టలేదు. తోటి వ్యక్తి ప్రమాదంలో ఉంటే తామంతా ఎలా ఆనందంగా ఉంటామని భావించి అందరూ ఏకగ్రీవంగా దీపావళిని చేపట్టకుండా మానవత్వం చాటుకున్న ఘటన పొందూరు పుట్టుగలో జరిగింది. గ్రామానికి చెందిన డి.రామమూర్తి, కుమారుడు ప్రణయ్ కుమార్ వారం కిందట కంచిలి మండలం పెద్ద కొజ్జిరియా జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకా కుళంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి మెరుగైన చికిత్స కోసం లక్షల్లో నగదు అవసరమవుతోంది. గ్రామస్థులంతా వారికి సహకారం అందిస్తున్నారు. ఈ సమయంలో దీపావళి పర్వదినం సోమవారం రావడంతో గ్రామస్థులంతా సందడి చేయకూడదనే నిర్ణయానికి వచ్చారు. గ్రామంలో ఉన్న 50 ఇళ్లల్లోను వెలుగులు లేకుండా తోటి గ్రామస్థులకు సంఘీభావంగా నిలిచారు.

దీపావళి కాంతులు లేని పొందూరుపుట్టుగ →



విశాఖకు గూగుల్ రాక ప్రతిష్ఠాత్మకం: ఎంపీ కలిశెట్టి

అరసవల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి గూగుల్ రాక ఎంతో ప్రతిష్ఠాత్మకమని విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తుంటే, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ నుంచి గూగుల్‌పై కుట్రకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. గూగుల్ అడ్డుకోవాలని చూస్తున్నారని అది జరగదన్నారు. వచ్చే నెలలో పారిశ్రామిక సదస్సు జరుగనుందని మరిన్ని కంపెనీలు ఉత్తరాంధ్రకు రానున్నాయ న్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు త్వరలో ప్రారంభం కానుందని, ఉత్తరాంధ్ర అభి వృద్ధి ఖాయమని ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవు

కంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):జిల్లుండ గ్రామంలో కొందరు వివక్ష చూపుతున్నారని గ్రామానికి చెందిన ఏడు దళిత కుటుంబాల వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్ఐ పారినాయుడు, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామస్థులతో మాట్లాడారు. తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో సమానంగా చూడడం లేదని, మంచినీళ్ల బావి వద్ద మా మహిళలను దూరంగా ఉంచుతున్నారని బాధితులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే తామెవరిపై వివక్ష చూపడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇటువంటి చర్యలు సరికాదని, ఇకపై అందరూ సమానంగా కలిసిమెలసి మెలగాలని అధికారులు సూచించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళిత సంఘ నాయకులు నగిరి మోహనరావు, జగ్గారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా పర్యాటక మండలి కలెక్టరేట్ సముదాయము
యువజన సర్వీస్ శాఖ
శ్రీకాకుళం జిల్లా టెండరు ప్రకటన

(Ref.No.01/DTC/SKLM/2025)

శ్రీకాకుళం జిల్లాలో ఈ క్రింద సూచించిన పర్యాటక ప్రదేశములో రెస్టారెంట్, Rest Rooms & Children Play Equipments విజయ ఆదిత్య సాగర్ పార్క్ నిర్వహణ కొరకు ఆసక్తి గల మరియు సంబంధిత ఆతిధ్యరంగం, రెస్టారెంట్ రంగంలో కనీసం మూడు సంవత్సరములు అనుభవం కలిగిన వ్యక్తులు/సంస్థల నుండి బిడ్స్ కోరబడుచున్నవి.

వరుస సంఖ్య	యూనిట్ పేరు	విస్తీర్ణము	కనీస సంవత్సర అద్దె (రూపాయలలో)
1	విజయ ఆదిత్య సాగర్ పార్క్ శ్రీకాకుళం వద్ద గల రెస్టారెంట్ Rooms & Children Play Equipments	విస్తీర్ణము రెస్టారెంట్ 9.76 సెంటులు	రూ. 7,00,000/- లేదా వార్షిక స్థూల ఆధాయంలో (Gross Revenue) 20% శాతము రెండింటిలో ఏది ఎక్కువైతే అది.

టెండరు షెడ్యూల్ ధర రూ.5000/- జిల్లా కలెక్టరు & ఛైర్మన్, డిటిసి & శ్రీకాకుళం జిల్లా పేరు మీద డిడి రూపంలో ఇచ్చి, టెండరు షెడ్యూల్ ఫారంను జిల్లా పర్యాటక & సంస్కృతి అధికారి, జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా 532001 నందు తేది: 23.10.2025 నుండి 29.10.2025 వరకు ఉదయం 11.00గం., నుండి సాయంత్రం 3.00గం., వరకు కార్యాలయపు పని దినములందు పొందగలరు. తేదీ: 23.10.2025 నుండి 29.10.2025 వరకు కార్యాలయపు పని దినములందు ఉదయం 11.00గం., నుండి సాయంత్రం 3.00గం., వరకు టెండరు షెడ్యూల్ ఫారంలు స్వీకరించబడును. తేదీ: 29.02.2024 సాయంత్రం 4.00గం., టెండర్లు ఓపెన్ చేయబడును. టెండరు వేయుటకు కావలసిన అర్హతలు, నిర్వహణ నియమావళి, వార్షిక లీజు స్థిరీకరణ టెండరు షెడ్యూల్ https://srikakulam.ap.gov.in/ నందు పొందపరచబడినవి.

టెండరు రద్దు పరుచు అధికారము కలెక్టరు వారికి కలదు. ఇతర వివరములకు సంప్రదించగలరు. జిల్లా పర్యాటక & సంస్కృతి అధికారి, పర్యాటక శాఖ, జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్: 8919168306

స్థలం: శ్రీకాకుళం

కలెక్టరు & ఛైర్మన్
జిల్లా పర్యాటక మండల, శ్రీకాకుళం జిల్లా

రైతుబజారు లేక రోడ్లపైనే వ్యాపారాలు

● నరసన్నపేటలో ట్రాఫిక్‌కు అంతరాయం ● తక్కువ ధరకు వ్యాపారులకు కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

నరసన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో రైతు బజారు లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు చేయాల్సివస్తోంది. నియోజకవర్గం కేంద్రం కావడంతోపాటు ఏడు మండలాలు ప్రజలు నిత్యం కూరగాయలు తదితర నిత్యావసరాల కోసం ఇక్కడికే వస్తుంటారు. దీనికితోడు జిల్లాలో రెండోపెద్ద వాణిజ్యకేంద్రంగా మారడం, జాతీయ రహదారికి, అటు ఒడిశాకు దగ్గరగా ఉండడంతో ప్రతిరోజూ రూ.లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. మరో వైపు రైతుబజారు లేకపోవడంతో రైతులు తాము పండించే కూరగాయలను వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో టీడీపీ ప్రభుత్వంహయంలో రైతుబజారు ఏర్పాటుచేయాలని అప్పటిల్లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రయత్నించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది. ఈనేపథ్యంలో మారుతీనగర్ జంక్షన్, కంబకాయిజంక్షన్, కాలేజీ రోడ్డులో కూరగాయాల దుకాణాలు నిర్వహిస్తుండడంతో నిత్యంట్రాఫిక్‌సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మార్కెట్‌లో ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన కూరగాయలు మార్కెట్ మున్నాళ్ల ముచ్చటగా తయారైంది.అలాగే మార్కెట్ నిర్మించి రెండు దశాబ్దాలు ఏళ్ల కావస్తున్నా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం పుణ్యమాని మార్కెట్‌లో షాపులకు వర్తకులు వెళ్ల కుండా రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటుచేశారు.దీంతో పంచాయతీకి ఏడాదికి సుమారు రూ.12 లక్షలు వరకు ఆదాయానికి గండిపడుతోంది. ఆ షాపుల ఉన్న ప్రాంతంలో రైతుబజారు ఏర్పాటు చేస్తే వ్యాపారులు, రైతులకు మేలు చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.


నరసన్నపేటలో రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తున్న దృశ్యం

ఘనంగా దీపావళి సంబరాలు

● వాడవాడలా బాణసంచా కాల్చి సందడి చేసిన యువత

జిల్లా వ్యాప్తంగా సోమవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ, ఎస్సీ బాలబాలికల వసతి గృహాల తోపాటు గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువత బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఉదయం లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల నరకాసుని దిష్టిబొమ్మను ఏర్పాటుచేసి దహనం చేశారు. టీడీపీ కార్యాలయాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి బాణసంచా కాల్చారు.
- ఆంధ్రజ్యోతి బృందం


ఆమదాలవలస: బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్


రణస్థలం: ప్రభుత్వ బాలికల వసతి గృహంలో స్వీట్లు పంచుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


కోటబొమ్మాళి: నిమ్మాడలోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చుతున్న మంత్రి అచ్చెన్నాయుడు


పాతపట్నం: క్యాంపు కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో కలిసి దీపావళి సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నరసన్నపేట: పోలాకి మండలంలోని మబగాంలో కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

గార, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మొగదాలపాడు సముద్రంలో ఆదివారం స్నానంచేస్తుండగా గల్లంతైన పొందూరు మండలం కింతలి ఖాజీపేటకు చెందిన అన్నపాన జగదీష్ మృతదేహం సోమవారం రాత్రి శ్రీకూర్మం, మత్స్యలేశం సముద్ర తీరంలో లభ్యమైనట్లు మెరైన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం సముద్రంలో స్నానం చేస్తుండగా యువకుడు గల్లంతైన సంగతి తెలిసిందే. మృతదేహం కోసం గాలిస్తుండగా శ్రీకూర్మం, మత్స్యలేశం గుర్తించి ఈ మేరకు మృతుడి తల్లిదండ్రులకు, గార పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఘటనా స్థలానికి గార పోలీసులు చేరుకొని శవ పంచనామాచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు గార ఏఎస్ఐ టి.చంద్రమోహన్ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈనెల 19న సుమారు 55 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. సదరు వ్యక్తి స్పృహలోనికి రాగా అతని వివరాలు అడుగగా శృంగవరపు లక్ష్మీనారాయణ అని మాత్రమే చెప్పాడని పోలీసులు తెలిపారు. అయితే సదరు వ్యక్తి మంగళవారం మృతి చెందినట్టు, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

టపాసులు గోదాముపై పడి..

●సోంపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.4.50 లక్షల ఆస్తినష్టం

సోంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చలపతిగోర్జి వీధిలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.4.50 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకాధికారి సూర్యారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దీపావళి సందర్భంగా టపాసులు కాలుస్తుండగా పట్టణానికి చెందిన సకలాబత్తుల రుద్రయ్యకు చెందిన గోడౌన్‌లో నిల్వ ఉంచిన వస్తువులపై తారాజువ్వలు పడి ఈ ప్రమాదం జరిగింది. మొదట చీపురు కట్టలకు అంటుకున్న నిప్పు అనంతరం మిగిలిన వస్తువులకు వ్యాపించి పెద్ద మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సోంపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, బాధితుడు తెలిపిన వివరాల మేరకు నాలుగున్నర లక్షల వరకు ఆస్థినష్టం జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. సిబ్బంది డి.భాస్కరరావు, విజయ్‌కుమార్, బాబూరావు, వెంకటరావు, మహందాత మంటలను అదుపుచేశారు.

పలాసలో గోదాముపై తారాజువ్వలు పడి..

పలాస, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వాసుపత్రి రోడ్డులో దీపావళి పురస్కరించుకుని సోమవారం రాత్రి తారాజువ్వలు ఎగిరిపడి ఓ గోదాములోపడింది. దీంతో అందులో ఉన్న వేస్ట్‌మెటీరియల్ దగ్ధమైంది. కాశీబుగ్గ అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకొన్నారు.ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. అలాగేమొగిలిపాడు గ్రామ సమీపంలో టపాసులు గడ్డివాముపై పడడంతో కాలిబూడిదయ్యింది. ఈ సంఘటనలో రూ.10వేలువరకూ నష్టం జరిగిఉంటుందని అంచనా వేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

బెల్లుపడ కాలనీలో అగ్నిప్రమాదం

● బూడిదైన గృహోపకరణాలు ● రూ.2 లక్షల ఆస్తినష్టం

ఇచ్ఛాపురం,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. కాలనీలో నివాసముంటున్న ఆటోడ్రైవర్ సీహెచ్ అనీల్ పనులు ముగించుకొని మంగళవారంరాత్రి ఇంటికిచేరుకున్నాడు.అదేసమయంలో మేడపైన గదిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ నిలుపుదలచేశారు.అలాగే అగ్నిమాపకఅధికారులకు సమాచారంఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చేసరికే స్థానికులు మంటలు ఆర్పేశారు. టీవీ, ఫ్రిజ్, ఇతర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయని, సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనంపై పడిన స్తంభం

● ఇద్దరికి తప్పిన పెనుప్రమాదం ● నుజ్జైన వాహనం


ద్విచక్రవాహనంపై పడిన విద్యుత్ స్తంభం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడభద్ర సమీపంలో గల రాజాం- గరుడభద్ర రోడ్డుపై సోమవారం ఉదయం విద్యుత్ స్తంభం పడిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులకు పెనుప్రమాదం తప్పింది. మోటారు సైకిల్ నుజ్జయింది. క్షతగాత్రులు, స్థానికులకథనం మేరకు..చినవంక మాజీ సర్పంచ్ సానాకృష్ణ, పల్లిసారథి గ్రామానికి చెందిన ఉప్పరపల్లి రామారావు ద్విచక్రవాహనంపై చినవంక నుంచి పల్లిసారథి, రాజాం మీదుగా బొడ్డపాడు వెళ్తుండగా గరుడభద్ర రహదారి వద్ద విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో వారిద్దరూ ద్విచక్రవాహనం కింద ఉండిపోగా స్థానికులు సహకారం గాయాలతో బయటపడ్డారు. అయితే ద్విచక్రవాహనంపై నుజ్జయింది. వెంటనే చుట్టుపక్కల ఉన్నవారు గాయాలతో ఉన్న ఇద్దరిని ప్రథమచికిత్స అందించారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా రోడ్డుపక్కన ఉన్న స్తంభాన్ని ప్రైవేటువ్యక్తులు తీసుకువెళ్లి సరిగ్గా పాతకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అదిపడిపోయిఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

తిలారు రైల్వే వంతెనపై బస్సులు నిలపాలి

జలుమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిలారు రైల్వే వంతెనపై ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయాలని మంగళవారం విద్యార్థులు వంతెన వద్ద ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ రైల్వే వంతెనపై బస్సులు నిలుపుదల చేయకపోవడంతో బస్సుకోసం సుమారు కిలోమీటరు వంతెన చివరకు నడవాల్సి వస్తోందని వాపోయారు. వంతెనపై నుండి బస్సులు నేరుగా వెళ్తుండడంతో తిలారు, రావిపాడు, తిలారు ఆర్ఎస్, చిన్నదూగాం, ఏనేటికొత్తూరు, తదితర 10 గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలుపడుతున్నామని తెలిపారు.కళాశాలలకు వెళ్లే, వచ్చే సమయంలోను విద్యార్థుల సౌకర్యార్థం వంతెన పక్కన నిర్మించిన అనుబంధ రోడ్లపై ఆర్టీసీ బస్సులు నడపాలని వారు డిమాండ్‌చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని విద్యార్థులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. దీనిపై శ్రీకాకుళం-2 డిపో మేనేజరు శర్మకు వివరణ కోరగా జాతీయరహదారిపై బస్సు షెల్టర్లు లేని వద్ద బస్సులు నిలుపుదలకు అనుమతులులేవన్నారు. ఇదివరలో వంతెనపై ప్రమాదం జరగడంతో పోలీసులు అక్కడ బస్సులు నిలుపుదల చేయవద్దని స్పష్టంచేశారని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమం కోసం పని చేయండి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో మూడు పీఏసీఎస్‌ల చైర్మన్లు, సభ్యులు రైతుల సంక్షేమం కోసం పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. సోమవారం నిమ్మాడలోగల తన క్యాంపు కార్యాలయంలో నందిగాం మండలంలోని తెంబూరు, దిమిలాడ పీఏసీఎస్‌లకు నియమితులైన చెర్మన్లు పోలాకి చంద్రశేఖర్, పినకాన అజయ్‌కుమార్, సభ్యులు బెండి గిరి, మద్దిలి అనంతయ్య, పురట ఉమాపతి, వీరస్వామి, కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, సభ్యులు సాసుమంతు అనంద్, సకలాభక్తుల రాంకుమార్ ఆయా మండలాల నాయకులతో మంగళవారం మంత్రి అచ్చెన్నాయుడుకు క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తిలు వారిని అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, పూజారి శైలజ, కర్రి అప్పారావు, నాళ్ల ఆదినారాయణ, చల్ల సింహాచలం, చింతల సింహాచలం పాల్గొన్నారు. కాగా పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుకు మంత్రి అచ్చెన్నాయుడు పంపిణీ చేశారు.

పాతపట్నానికి రైతుబజారు మంజూరు: ఎంజీఆర్

పాతపట్నం/రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో రైతుబజారు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మంగళవారం పాతపట్నంలోని ఆలాంద్రరోడ్‌లోగల ప్రహరాజపాలెం రెవెన్యూ గ్రామపరిధిలో రైతుబజారు ఏర్పాటుకోసం స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు, టీడీపీ నేతలు పైల బాబ్జీ, సైలాడ సతీష్ అక్కంద్ర సన్యాసిరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలే ప్రశాంతతకు మార్గం

పాతపట్నం అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికభావాలే ప్రశాంతతకు మార్గమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. పాతపట్నం పరిధిలోని అచ్యుతాపురం ముత్యాలమ్మతల్లి ఆలయం ఆవరణలో అయ్యప్పస్వామి సన్నిధాన నిర్మాణానికి భక్తుడు బీవీప్రసాద్ ఇచ్చిన రూ.20వేలు విరాళాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అయ్యప్ప భక్తులకు మంగళవారం అందజేశారు.

పలాస జీడి పప్పునకు పేటెంట్ సాధించాలి

● కొత్త పారిశ్రామికవాడలో స్థలాలు కేటాయిస్తాం: ఎమ్మెల్యే గౌతు శిరీష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస జీడి పప్పు అరకు కాఫీ వలె పేటెంట్ హక్కు సాధించాలని ఎమ్మెల్యే గౌతుశిరీష కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలోజీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం ప్రధానకార్యదర్శిజిల్లాటీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా అధ్యక్షతన మనపిక్క-మన బాధ్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారంతో ఇప్పటికే పలాసలో కేంద్రీయ విద్యాలయం రప్పించుకున్నామని, జీడి బోర్డుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని,తొందరలోనే పలాసలో కొత్త పారిశ్రామికవాడలో వ్యాపారులకు స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రజలు దీవిస్తే పలాసను రాష్ట్రంలో అగ్రగామిగా తీర్చిదిద్దే బాధ్యత గౌతు కుటుంబానిదని భరోసా ఇచ్చారు. పలాస టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి మాట్లాడుతూ పలాస జీడి పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి సంయుక్తంగా కృషి చేయాలని, మన పిక్క-మన బాధ్యత కార్యక్రమం ద్వారా 2035 నాటికి పలాస జీడిపప్పు అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులు సాధించాలని పిలుపునిచ్చారు. కొత్త జీడి వంగడాల ద్వారా అధిక లాభాలు కలిగే అవకాశాలు ఉన్నాయని, దీన్ని రైతుల్లో విస్తృతంగా ప్రచారాలుచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పీసీఎంఏ(పారిశ్రామికవాడ) అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, ఆలిండియా క్యాజూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, కార్మికసంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, బ్యాంకర్లు, ఉద్యానవనశాఖ అధికారులు, సైంటిస్టులు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

24న మెగా వైద్య శిబిరం

హరిపురం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): హరిపురంలో గాయిత్రీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు, కోస్టల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా క్యాన్సర్‌వ్యాధి నిర్ధారణ,గుండె పరీక్షలు,కిడ్నీసంబంధిత స్కానింగ్‌లు ఎక్స్‌రేలు, 2డీ ఎకో స్కాన్‌లు ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

26 నుంచి చదరంగం పోటీలు

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో ఈనెల 26 నుంచి జిల్లాస్థాయి స్కూల్స్ ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం టెక్కలిలో ఆ పోటీల గోడపత్రికలను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్ చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు ఎస్.భీమారావు, సభ్యులు అవినాష్ పాల్గొన్నారు.

ఎండల మల్లన్న దర్శనం టికెట్ల ధర ఖరారు

టెక్కలి రూరల్,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఎండల మల్లన్న దేవస్థానం దర్శన టికెట్ల ధరలను ఖరారుచేసినట్లు మంగళవారం దేవదాయశాఖ ఈవో జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి వచ్చేనెల 17వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు శీర్షాభిషేకం రూ.40, ప్రత్యేక దర్శనం రూ.20 కేశఖండనకు రూ.40 రుద్రాభిషేకానికి 58గా నిర్ణయించినట్లు తెలిపారు.

ఆటోక్యాడ్‌పై శిక్షణ

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఆటో క్యాడ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. సివిల్‌ఇంజనీరింగ్ విద్యార్థులు బిల్డింగ్‌ప్లాన్, ఎలివేషన్, ఐసోమెట్రిక్, బీమ్‌లు, క్రాష్ సెక్షన్ డిజైన్లపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, దాలినాయుడు, హెచ్‌వోడీ దినాకర్, రామారావు పాల్గొన్నారు.

రైల్వేరన్నింగ్ రూములో నాగుపాము కలకలం



పలాస, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలాసలోని రైల్వేరన్నింగ్ రూములో మంగళవారం సాయంత్రం ఐదడుగుల పొడవు ఉండే గోధుమనాగు పాము కలకలం సృష్టించింది. రైల్వే డ్రైవర్లు, గార్డులు విశ్రాంతి తీసుకునే ఈ ప్రాంతంలో నాగుపాము కనిపించడంతో అందరూ పరుగులు తీశారు. అనంతరం సిబ్బంది స్నేక్ క్యాచర్ ఓంకార్‌త్యాడికి ఫోన్ చేయడంతో ఆయన సకాలంలో వచ్చి పామును చాకచక్యంగా బంధించాడు. అనంతరం అడవిప్రాంతంలో విడిచిపెట్టారు.

బీమా చెక్కు పంపిణీ

నరసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మృతిచెందిన మాజీ సైనికుడు బొత్స శ్రీరాములు భార్య సూరీడుకు మంగళవారం ఎస్‌బీఐ ప్రమాదబీమాపథకంలో భాగంగా నరసన్నపేటలో ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ డి. మధుసూదనరావు రూ.50 లక్షలు చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎస్‌బీఐలో శాలరీ పెన్షన్ ప్యాకేజీలో అకౌంట్ గలఖాతాదారులు ప్రమాదంలో మృతిచెందితే ఆ కుటుంబానికి తమ బ్యాంకు అండగా ఉంటుందన్నారు. శ్రీరాములు ఈ ఏడాది ఏప్రిల్ 8న లుకలాంలో చెట్టుపై నుంచి పడిమృతిచెందిన విషయం విదితమే.

పురమిత్ర యాప్ వినియోగంలో ప్రథమస్థానం

● పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ రామారావు

పలాస, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పురమిత్ర యాప్ ద్వారా ఇప్పటి వరకూ 407 సమస్యలు పరిష్కరించారని, దీని వినియోగంలో పలాస-కాశీబుగ్గ ప్రథమంగా నిలిచిందని మునిసిపల్ కమిషనర్ ఎస్.రామారావు తెలిపారు. మంగళవారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురపాలకసంఘంలో సేవలు మరింత సులభంగా చేయడానికి పురమిత్ర యాప్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. పారిశుధ్యం, వీధిదీపాలు, మంచినీటి సమస్య, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్‌వంటి సమస్యలు ఫోటోలుతీసి పురసేవలో అప్‌లోడ్‌చేస్తే వాటి ట్రాకింగ్ సిస్టం ద్వారా నిర్ణీతసమయంలో పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వ్యవస్థ ద్వారా పనిచేస్తే ఈయాప్‌ను నేరుగా పురపాలక శాఖమంత్రి పేషీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇంటి పన్నులు, జనన, మరణ, వివాహ పత్రాలు, ప్రకటనల ట్యాక్స్ ఇందులోనే ఉచితంగా పొందవచ్చని చెప్పారు.

25లోగా ఈ-కేవైసీ పూర్తిచేయాలి: ఏపీవో

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీతోనే ఉపాధిపనుల్లో అక్రమాలను నిరోధించవచ్చని ఏపీవో శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఎల్. ఎన్.పేటలోని ఉపాధిహామీ కార్యాలయంలో టెక్నికల్‌అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25లోగా ఉపాధికూలీల ఈ-కేవైసీని పూర్తిచేయాలని టెక్నికల్ అసిస్టెంట్లుకు తెలియజేశారు. గతంలో ఒకేజాబ్‌కార్డులో ఉన్నవారు ఒకరి తరపున ఇంకొకరు పనులు చేసేందుకు అవకాశముండేదని ఇక అటువంటి అవకాశముండదని తెలిపారు. సమావేశంలో ఈసీ కె. సింహాద్రి పాల్గొన్నారు.

బాలియాత్రకు ఏర్పాట్లుచేయాలి: ఆర్డీవో


అధికారులతో సమీక్షిస్తున్న శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష

జలుమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో వచ్చేనెల 9న కార్తీకమాసం పురస్కరించుకొని నిర్వహించే బాలియాత్ర దీపోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లుచేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష ఆదేశించారు. మంగళవారం జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా యాత్రకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని శ్రీముఖలింగేశ్వరాలయం ఈవో ఏడుకొండలకు ఆదేశించారు. పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు సూచించారు. సమావేశంలో తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, బాలియాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మొక్కల తొలగింపు


శ్మశాన వాటికలో మొక్కలను తొలగించి చదునుచేసిన దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):మెళియాపుట్టిలోని శ్మశాన వాటికను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎరుసు శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో అభివృద్ధిచేశారు.మెళియాపుట్టిలో శ్మశానవాటిక శుభ్రంగాలేకపోవడంతో స్థానికులు మృతిచెందిన తర్వాత కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బందులుపడుతున్నారు. గ్రామంలో సుమారు ఏడువేల కుటుంబాలు నివసిస్తున్నాయి. మహేంద్రతనయ నదిఒడ్డున ఉన్న ఈశ్మశానవాటికలోనే పూర్వీకుల కాలం నుంచి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ పిచ్చిమొక్కలు, డొంకలు పెరిగిమూసుకుపోవడంతో గ్రామస్థులు దహనసంస్కారాల సమయంలో ఇబ్బంది పడుతున్నారు.దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో గట్టును చదును చేయించడంతోపాటు మొక్కలు తొలగించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించనున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.శ్మశానవాటికను చదును చేయించడంతో శ్రీనివాస్ రెడ్డి గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకట్రావ్, దున్నా శ్రీను, కృష్ణారావు, మనోజ్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో వ్యర్థాల తొలగింపు

పాతపట్నం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలోని ఆలాంద్రరోడ్డులో డంపింగ్ యార్డులో వ్యర్థాలను పంచాయతీఅధికారులు ఎట్టకేలకు తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఇక్కడ వ్యర్థాలు పేరుకుపోవడంతో ఆలాంద్రరోడ్ గుండా వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు పరిసరగ్రామాల ప్రజలు అవస్థలకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పెన్షనర్లకు పీఆర్సీచెల్లింపులో న్యాయం చేయాలి

నందిగాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు పీఆర్‌సీ చెల్లింపులో న్యాయం చేయాలని ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్షులు తమిరి వైకుంఠరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం డీఆర్ జీవో61ని విడుదల చేస్తూ డీఏ ప్రకటించిందని, దీన్ని 17 నెలలు తరువాత 12 వాయిదాల్లో బకాయిలు చెల్లిస్తామని చెప్పడం సరికాదని, దీన్ని సవరించి సొమ్ములు నేరుగా ఇవ్వాలని కోరారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీ

పోలాకి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రెండోసెమిస్టర్ పాఠ్యపుస్తకాలను మంగళవారం పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశామని ఎంఈవోలు శ్రీనివాసనాయక్, శ్రీనివాసరెడ్డి తెలిపారు.పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలకు పరీక్షల ముందు పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. మంగళవారం ఒకటి నుంచి ఐదోతరగతి వరకూ, గతవారం ఉన్నతపాఠశాలకు 13వేల పాఠ్యపుస్తకాలను విడతల వారీగా అందజేశామని చెప్పారు. నవంబరు ఒకటో తేదీ నాటికి ప్రతివిద్యార్థివద్ద నూతనంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు ఉండాలని తెలిపారు.